
క్లుప్తంగా

సిరులతల్లికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు సిరులతల్లికి తులసీ పూజ..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసిపూజ నిర్వహించనున్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

వార్డు అభివృద్ధి పనులకు శ్రీకారం



మంచినీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న పద్మావతి

అల్లిపురం: జీవీఎంసీ 34వ వార్డులోని యాతపేటలో రూ.13 లక్షలతో చేపట్టనున్న వార్డు అభివృద్ధి పనులకు శుక్రవారం కార్పొరేటర్ తోట పద్మావతి భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాతపేటలో రూ.13 లక్షలతో మంచినీటి పైప్‌లైన్ పనులు చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాస్, గాలి పార్వతి, నాగమణి, దానయమ్మ, అనిల్, జనసేన వార్డు అధ్యక్షుడు నీలం రాజు, వాసుపల్లి నరేష్, నీల్లాటి రాజ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు తోపుడు బండ్ల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు తోపుడు బండ్లు పంపిణీ చేస్తున్న తోట పద్మావతి

అల్లిపురం: జీవీఎంసీ 34వ వార్డు పారిశుధ్య కార్మికులకు వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి తోపుడు బండ్లు పంపిణీ చేశారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ వార్డులో పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పారిశుధ్య కార్మికులు తమ ఆరోగ్యం కాడుకుంటూ ప్రజల ఆరోగ్యాన్ని కూడా కాపాడాలని కోరారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్, వార్డు నాయకులు లండా రయణ, లింగం శ్రీనివాస్, గాలి పార్వతి, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ ఘటనపై న్యాయ విచారణకు డిమాండ్

ఏయూక్యాంపస్: మన్యం జిల్లా కురుపాం ఆశ్రమ బాలికల గిరిజన పాఠశాల హాస్టల్‌లో పచ్చకామెర్లతో ఇద్దరు బాలికలు మృతి చెందడం, 140 మంది బాలికలు అస్వస్థతకు గురైన నేపథ్యంలో ఈ సంఘటనపై న్యాయ విచారణ జరిపించాలని ఉత్తరాంధ్ర పరిరక్షణ సమితి అధ్యక్షుడు లగుడు గోవిందరావు డిమాండ్ చేశారు. బీచ్ రోడ్డులోని ఒక హోటల్‌లో విలేకరులతో మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న నిరుపేద చిన్నారులు అనారోగ్యం పాలవడం బాధాకరమన్నారు. వీరంతా తమ ప్రతిభతో విద్యలో రాణిస్తున్నారన్నారు. ఇటువంటి గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉందన్నారు. చిన్నారులు అనారోగ్యం పాలవడానికి కారణమైన, నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



జీవీఎస్ఎన్ రహదారిలో నిలిపి ఉంచిన స్క్రాప్ వాహనాలు



రామకృష్ణా రైతుబజార్ ఎదురుగా అనధికార వాహనాల పార్కింగ్

పార్కింగ్‌ల జోరు.. ప్రజల బేజారు

- ఇష్టానుసారంగా వాహనాల నిలుపుదలతో ఇక్కట్లు
- పద్మవ్యూహాన్ని తలపిస్తున్న పాతనగరం
- పట్టించుకోని సంబంధిత అధికారులు

జగదాంబ: పాతనగరంలోని చాలా ప్రాంతాల్లో పార్కింగ్ ఒక తీరుతెన్నూ లేకుండా ఉంటుంది. అలాగే వ్యాపారాలు కూడా సాగుతుంటాయి. ముఖ్యంగా పూర్ణామార్కెట్‌లో ఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. హోల్‌సేల్ దుకాణాలు, చిరు వ్యాపారాలు, కూరగాయల షాపులు, బియ్యం తదితర వ్యాపారాలతో ఇదొక పద్మవ్యూహంలా ఉంటుంది. దీనికి తోడు ఈ దుకాణాలకు సరుకులు తీసుకొచ్చే భారీ వాహనాలు షాపుల ముందే నిలిపి సరుకును దించుతుంటారు. ఆ తతంగం అంతా ముగిసే వరకు రహదారి బ్లాక్ అయిపోతుంది. దాంతో ఇతర వాహనాలు వెళ్లలేవు.. పాదచారులు రాకపోకలు సాగించలేరు.

రామకృష్ణా రైతుబజార్ వద్ద..

పాతనగరంలోని రామకృష్ణా రైతుబజార్ వద్ద రహదారికి ఇరు వైపులా పెద్ద పెద్ద వాహనాలు పార్కింగ్ పేరిట రోజుల తరబడి నిలిపి ఉంచేస్తున్నారు. దీంతో రహదారి కుదించుకుపోయి ఎదురెదురుగా వచ్చే వాహనాలు ముందుకెళ్లలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ కారణం వల్ల కొన్నిసార్లు ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ఎవరైనా నిలిపి ఉంచుతున్న వాహనాల గురించి సంబంధిత వ్యక్తులను ప్రశ్నిస్తే వారు వాగ్వాదాలకు దిగుతున్న సందర్భాలు కూడా ఉన్నాయి.

స్ప్రింగ్ రోడ్డులో..

పూర్ణామార్కెట్ వద్ద వన్‌టౌన్, టూ టౌన్ పోలీసు స్టేషన్ల పరిధిలో ఉన్న స్ప్రింగ్ రోడ్డులో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని వినియోగదారులు వాపోతున్నారు. ఇది హోల్‌సేల్ మార్కెట్ కావడంతో పెద్ద సంఖ్యలో ఇక్కడికి వినియోగదారులు వస్తుంటారు. వీరంతా ఆ ప్రాంతంలో వరుసగా ఉండే దుకాణాలలో సరుకులు కొనుగోలు చేసుకునేందుకు తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేసి వెళ్లిపోతుంటారు. ఆయా దుకాణాల వారు కూడా తమ కస్టమర్ల సౌలభ్యం కోసం పార్కింగ్ సదుపాయం కల్పించరు. దీంతో స్ప్రింగ్ రోడ్డంతా ఎప్పుడు చూసినా వాహనాల బారులతో రద్దీగా.. గజిబిజి ట్రాఫిక్‌తో కనిపిస్తూ.. వాహనాలు, పాదచారుల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తూ ఉంటుంది.

పందుంపుల్లల సందు వద్ద..

పందుంపుల్లల సందు నుంచి స్టేడియం వరకు స్క్రాప్ వాహనాలను లెక్కకు మిక్కిలి నెలల తరబడి నిలిపి ఉంచుతున్నారు. దీని వల్ల ఆ దారిలో ప్రయాణం అంటేనే భయపడే పరిస్థితి. వాహనాల పార్కింగ్ వల్ల రహదారి ఇరుగ్గా మారి సులువుగా ప్రయాణించే వీలు లేకుండా పోతోంది. అలాగే పూర్ణామార్కెట్ వెనుక గేటు వద్ద వినియోగదారులు ద్విచక్ర వాహనాలను ఇష్టానుసారంగా పార్కింగ్ చేయడం వల్ల మార్కెట్ లోపలి నుంచి బయటికి రాలేని పరిస్థితి ఏర్పడుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా గేటుకు ఎదురుగా వినియోగదారులు వాహనాలు పార్కింగ్ చేయడం వల్ల తమ బేరాలు పోతున్నాయని మార్కెట్ లోపలి వ్యాపారులు వాపోతున్నారు.

పార్కింగ్ సదుపాయం కల్పించాలి..

పాతనగరంలోని రద్దీగా ఉండే పలు ప్రాంతాల్లో అటు అధికారులు, ఇటు ట్రాఫిక్ పోలీసులు పార్కింగ్ సదుపాయం కల్పించాలని పలువురు వినియోగదారులు కోరుతున్నారు. పూర్ణామార్కెట్‌కు సరుకుల కోసం వచ్చే వారు సరుకులు కొనే దుకాణాల ముందు వాహనాలు పార్కింగ్ చేసి వెళ్లిపోతున్నారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. అలా కాకుండా వినియోగదారుల తాకిడి అధికంగా ఉండే చోట పార్కింగ్ ఏర్పాటు గనుక చేస్తే మార్కెట్ రహదారి వాహనాలు, పాదచారుల రాకపోకలకు సులువుగా ఉంటుందని పలువురు సూచిస్తున్నారు.



స్ప్రింగ్ రోడ్డులో ద్విచక్ర వాహనాల పార్కింగ్



వస్త్ర వ్యాపారాలతో ఇరుగ్గా మారిన పందుంపుల్లల సందు

విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలి



దేశభక్తి గీతాలు ఆలపిస్తున్న విద్యార్థులు

దాబాగార్డెన్స్: విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలని ఐఆర్ఎస్‌ఈ అధికారి వీఆర్ నాయుడు సూచించారు. భారత్ వికాస్ పరిషత్ విశాఖపట్నం శాఖ ఆధ్వర్యంలో నగరంలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ భవన్‌లో జాతీయ దేశభక్తి బృందగాన పోటీలు, భారత్ కో జానో క్విజ్ పోటీలు జిల్లా స్థాయిలో నిర్వహించారు. నగరానికి చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొని హిందీ, సంస్కృత దేశభక్తి గీతాలు, ప్రాంతీయ భాషల్లో జానపద గీతాలు మధురంగా ఆలపించి ప్రతిభ చాటుకున్నారు. పోటీలను కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు (తాతాజీ) జ్యోతి వెలగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి దేశభక్తి, మేధాశక్తి కలిగి ఉండాలని, విద్యలో ప్రతిభ చూపాలని ఆశీస్సులు అందజేశారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న వీఆర్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకుని, బాగా చదువుకుని దేశం గర్వించదగ్గ విద్యార్థులుగా ఎదగాలన్నారు. కన్నవారికి, ఉన్న ఊరికి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య పి.అర్జున్, ఎంవీవీ సత్యనారాయణ, భారత్ వికాస్ పరిషత్ విశాఖ శాఖ అధ్యక్షుడు సీహెచ్‌వీ సత్యనారాయణ, కార్యదర్శి పి.భాస్కరరావు, కోశాధికారి జీఎస్‌వీ మాణిక్యాలరావు, ప్రోగ్రామ్ కన్వీనర్లు ఎంఎస్ఎల్ శైలజ, ఎంవీ రాజశేఖర్, పంపాన వెంకటేశ్వరరావు, సంస్థ సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఓ బూటకం

- వైఎస్సార్ సీపీ కోటి సంతకాల సేకరణను విజయవంతం చేద్దాం
- ప్రజా ఉద్యమ పోస్టర్ ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి



పార్టీ శ్రేణులు, జాన్‌వెస్లీతో కలిసి పోస్టర్ ఆవిష్కరిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరగనున్న వైఎస్సార్ సీపీ కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం పార్టీ శ్రేణులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి విద్యార్థులు డాక్టర్లు కావాలన్న జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పంతో నెలకొల్పిన మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయాలన్న చంద్రబాబు కుటిల రాజకీయాలను యువత అంతా తిప్పి కొట్టాలన్నారు. అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు నవంబర్ 22 వరకు రచ్చబండ సంతకాల సేకరణ, ఈ నెల 22 నుంచి నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు, నవంబర్ 12న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు జరుగుతాయన్నారు. నవంబర్ 23న నియోజకవర్గాల నుంచి జిల్లా కేంద్రాలకు సంతకాల పత్రాలు తరలిస్తామని, నవంబర్ 24న పార్టీ కేంద్ర కార్యాలయానికి అవి చేరుకుంటాయన్నారు. అనంతరం గవర్నర్‌కు నివేదిక, కోటి సంతకాల పత్రాల అందజేత కార్యక్రమం నిర్వహిస్తామని వెల్లడించారు. మెడికల కాలేజీల ప్రైవేటీకరణ బూటకమని వాసుపల్లి ఆరోపించారు. తక్షణమే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ, పలు వార్డుల కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జగన్ అడుగేస్తే.. ప్రభంజనమే

జగనన్న పర్యటన సక్సెస్ మీట్‌లో వాసుపల్లి



ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుని సంబరాలు జరుపుకుంటున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

దాబాగార్డెన్స్: జననేత జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల నీరాజనాలు అందుకోవడం కూటమి నేతల గుండెల్లో గుబులు పుట్టించిందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ పర్యటన సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలో దక్షిణ వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలి రావడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అడుగడుగునా అదే ఆప్యాయత కనిపించడంతో జగనన్న విశాఖ పర్యటన ఆసక్తి రేకెత్తించిందన్నారు. జన నీరాజనం చూసిన కూటమి నేతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. పోలీసులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా జన సునామీని ఆపలేకపోయారన్నారు. ఎండకు, వర్షానికి బెదరకుండా జగనన్నను చూసేందుకు ఎగబడిన ప్రజల ఆదరణ వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో రెట్టింపు ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. భూమి బద్దలు అయిందా.. అన్నట్లు జనం స్వచ్ఛందంగా తరలి వచ్చారని చెప్పారు. కేజీహెచ్ పిల్లల వార్డులో చికిత్స పొందుతున్న గిరిజన బాలికలను పరామర్శించేందుకు వచ్చిన మాజీ సీఎం జగనన్నను చూసేందుకు ఆ ప్రాంతమంతా జనసందోహంతో నిండిపోయిందన్నారు. దక్షిణ నియోజకవర్గంలో అన్ని వార్డుల నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులతో పాటు జనసందోహం కదిలి వచ్చిందని వాసుపల్లి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ శ్రేణులు స్వీట్స్ పంపిణీ చేసుకుని సంబరాలు జరుపుకున్నారు. సక్సెస్ మీట్‌లో పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, పలువురు కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల నేతలు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నర్సుల సమస్యలు, సంక్షేమంపై భేటీ



ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణను సత్కరిస్తున్న నర్సెస్ వింగ్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తున్న నర్సుల సమస్యలు, సంక్షేమంపై ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ, కార్యదర్శి ఎం.రమేష్‌కుమార్‌తో ఏపీ గవర్నమెంట్ నర్సెస్ వింగ్ ప్రతినిధులు జైతు రవీంద్రనాథ్, వి.ఉషారాణి, జి.శాంతమ్మ, వింగ్ చైర్‌పర్సన్ మంజులాదేవి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి చర్చించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అదనపు సిబ్బంది, సహాయక సిబ్బంది నియామకం, స్టాఫ్ నర్స్ అనే నామకరణాన్ని నర్సింగ్ ఆఫీసర్‌గా మార్చడం, నర్సుల సంక్షేమం కోసం నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటు, 55 ఏళ్లు పైబడిన నర్సులను కొండ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలకు బదిలీ చేయకుండా మినహాయింపు తదితర అంశాలపై రాష్ట్ర అధ్యక్షుడితో చర్చించారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నర్సెస్ వింగ్ ప్రతినిధులు తెలిపారు.

పీహెచ్‌సీల్లో అదనపు సిబ్బంది నియామకానికి వినతి



మంత్రితో చర్చిస్తున్న నర్సింగ్ అసోసియేషన్ నాయకులు

మహారాణిపేట: రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అదనపు సిబ్బంది, నర్సులను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వ నర్సింగ్ అసోసియేషన్ నాయకులు ఉషారాణి, సంతమ్మ, జైతు రవీంద్రనాథ్, మంజులాదేవి కోరారు. శుక్రవారం అమరావతిలో ప్రభుత్వ నర్సుల అసోసియేషన్, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులతో మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిశారు. స్టాఫ్ నర్స్ అనే నామకరణాన్ని నర్సింగ్ ఆఫీసర్‌గా మార్చాలని, నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని, 55 సంవత్సరాలు పైబడిన నర్సులను కొండ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలకు బదిలీ చేయకుండా మినహాయింపు ఇవ్వాలని కోరగా సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు. ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్. సూర్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి ఎం. రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యం విద్యార్థులకు మేయర్ ప్రశంస



పిల్లలను అభినందిస్తున్న మేయర్ శ్రీనివాసరావు

దాబాగార్డెన్స్: బాల్యం కేంద్రాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆటపాటలతో కూడిన విద్యాబోధన అందించాలని మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం గత నెలలో జాతీయ స్థాయిలో లైవ్ కాంపిటీషన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచిన జీవీఎంసీ బాల్యం విద్యార్థులను అభినందించారు. దేశంలో 20 రాష్ట్రాలకు సంబంధించి 150 జిల్లాల నుంచి 250 మంది 3 నుంచి 5 ఏళ్లలోపు విద్యార్థులు ఈ జాతీయ స్థాయి లైవ్ కాంపిటీషన్ పోటీలో పాల్గొన్నారని, ఉత్తమ ప్రతిభ కనబరిచిన మల్కాపురం, చెంగల్రావుపేట బాల్యం కేంద్రాల్లోని నాలుగేళ్ల వయస్సు గల విద్యార్థులు కారే హారి శిశిక, డోమనా గ్రీష్మ ఆంగ్ల పద్యాల కేటగిరీలో విజేతలుగా నిలిచారని, ఆర్పీ పేట, ప్రగతినగర్ బాల్యం కేంద్రాల్లోని పిల్లలు చిటికెల హాన్విక, పిల్లి ప్రణతి ఫ్యాన్సీ డ్రెస్ కేటగిరీలో విజేతలుగా నిలిచారని, వీరికి ఢిల్లీలోని చైల్డ్ డ్రీమ్ బూస్టర్ హబ్ నిర్వాహకులు మెడల్స్, షీల్డ్స్, ప్రతిభా పత్రాలు అందించారని మేయర్ తెలుపుతూ విద్యార్థులు, బాల్యం కేంద్రాల అధ్యాపకులను అభినందించారు.

సమాచార శాఖ నూతన డైరెక్టర్‌కు శుభాకాంక్షలు



సమాచార శాఖ నూతన డైరెక్టర్ విశ్వనాథన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

మహారాణిపేట: సమాచార పౌర సంబంధాల శాఖ నూతన డైరెక్టర్‌గా నియమితులైన ప్రస్తుత వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్‌ను ఆ శాఖ విశాఖ జిల్లా అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం వీఎంఆర్‌డీఏ భవనంలోని ఆయన చాంబర్‌లో జాయింట్ డైరెక్టర్ వి. మణిరామ్, డిప్యూటీ డైరెక్టర్ కె. సదారావు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో వివిధ హోదాల్లో సేవలందించి తమ శాఖ హెచ్‌వోడీగా వస్తున్నందుకు హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించారు. ఈ క్రమంలో సమాచారశాఖ కార్యకలాపాలు, అందులోని విభాగాలు, అధికారుల హోదాలు, విధులు తదితర ప్రాథమిక అంశాల గురించి డైరెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అందరూ మరింత ఉత్సాహంతో పని చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా పని చేస్తున్న కె.ఎస్. విశ్వనాథన్‌ను సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయన్ని కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో డివిజనల్ పీఆర్‌వో నారాయణరావు, ఏపీఆర్‌వో శ్రీనివాసరావు, ఏవీ సూపర్ వైజర్ వెంకటరావు తదితరులు ఉన్నారు.

నిరాశ్రయుల సంక్షేమం కోసం కృషి చేద్దాం

అల్లిపురం: నిరాశ్రయుల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు అన్నారు. ప్రపంచ నిరాశ్రయ దినోత్సవం వార్డులో జీవీఎంసీ, సిటీ పోలీస్, సివిల్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన 32వ వార్డులోనే మూడు షెల్టర్లు ఉన్నాయని చెప్పారు. అందులో ఒకటి బీమ్ నగర్‌లో ఉండగా, మరో రెండు టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో ఉన్నాయని చెప్పారు. నగర పోలీస్ కమిషనర్ బెగ్గర్స్ లేని సిటీ కోసం చేస్తున్న ప్రయత్నంలో భాగంగా సుమారు 200 మందికి ఈ షెల్టర్లలో పునరావాసం కల్పించడాన్ని కొనియాడారు. ఇళ్ల నుంచి తప్పిపోయి లేదా పారిపోయి వచ్చే కేసులను పరిష్కరించడంలో పోలీసులకు ఈ షెల్టర్లు ఉపయోగపడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అప్పారావు, సీపీఐ బుజ్జి, ఆది బాబు, కేదార్నాథ్, బద్రీనాథ్, ప్రగడ వాసు తదితరులు పాల్గొన్నారు.

డ్రైడేతో దోమల నియంత్రణ



నరసింహనగర్‌లో దోమల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న కోట్ని శ్రీనివాసరావు

సీతంపేట: వారానికి ఒక రోజు డ్రైడే పాటిస్తే దోమల పెరుగుదలను నియంత్రించవచ్చని మలేరియా హెల్త్ అసిస్టెంట్ కోట్ని శ్రీనివాసరావు అన్నారు. 26, 43 వార్డుల పరిధిలోని అక్కయ్యపాలెం, నరసింహనగర్, నరేంద్రనగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఫ్రైడే–డ్రైడే అమలు తీరును ఆయన పరిశీలించారు. ఏఎన్ఎం, ఆశా, యాంటీ లార్వా ఆపరేషన్స్ సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి నీటి నిల్వలను పరిశీలించి కుండీలు, డ్రమ్ముల్లో లార్వాలు పెరుగుతున్నట్టు గుర్తించి, ఆ నీటిని పారబోయించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వారం రోజులు దాటి మంచినీరు, వర్షపు నీరు నిల్వ ఉంటే మలేరియా, డెంగ్యూ జ్వరాలను కలుగజేసే దోమలు వృద్ధి చెందే అవకాశముందన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. జ్వరంతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు చేసి మందులు అందజేశారు.

గార్డెన్ కార్మికుల తొలగింపు అన్యాయం



కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గార్డెన్ కార్మికులు

సీతంపేట: వీఎంఆర్‌డీఏ పార్కుల్లో అక్రమంగా తొలగించిన గార్డెన్ కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని వీఎంఆర్‌డీఏ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి వి.కృష్ణారావు డిమాండ్ చేశారు. సెంట్రల్ పార్క్, కైలాసగిరి, వీఎంఆర్‌డీఏ పార్క్, తెన్నేటి పార్కుల్లో పనిచేస్తున్న 18 మంది తోటమాలీలను డీఎఫ్‌వో అధికారి అన్యాయంగా తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ అక్కయ్యపాలెం కార్మిక శాఖ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక కేంద్రాలుగా ఉన్న వీఎంఆర్‌డీఏ పార్కుల్లోని ఏడు సొసైటీల్లో 250 మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. వీరికి కార్మిక చట్టాలు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. 35 ఏళ్లుగా పనిచేస్తున్న 18 మంది గార్డెన్ కార్మికులను ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించడాన్ని తప్పుబట్టారు. అక్రమంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకునేలా కార్మిక శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.